# చానమ్మ చెరువు

నిండు కుండలాంటి మనిషిలో ఇన్నాళ్ల తరువాత మొట్టమొదటిసారిగా తొట్రుపాటు చూశాను. నిండుకుండ తొణికినందుకు మనసులో ముల్లు గుచ్చుకున్నట్లయింది.

నన్ను ఆదేశించగలిగి కూడా ''చిన్న అవసరం, ఆదుకుంటావా ?'' అని అడిగాడు.

నాలుగేళ్లుగా నామీద ఆఫీసరు, సహజంగా హుందాగా ఉండే మనిషి ఎక్కువ చనువు ఇచ్చినట్లు కనబడకపోయినా ఆత్మీయత చూపించడం తెలియని మనిషి కాదు. అది తెలుసుకోవడం అంత సామాన్యమైన విషయమూ కాదు.

'' ఒకసారి వస్తారా !'' అన్నాడు ఇంటర్‌కమ్‌లో. డిక్టేషన్ ఇస్తున్నాడు. కూచోండని నాకు కుర్చీ చూపించి తను లేచి నిలుచున్నాడు.

''మిగిలింది తరువాత చూద్దాం'' అనే సరికి అంతరంగిక కార్యదర్శి నా వంక ఒకమారు చూసి బయటకు వెళ్లిపోయాడు.

'' మనిషిమీద మనిషికి నమ్మకం చచ్చిపోయింది. విశ్వాసం అనే మాటకి అర్థాల్లో వంకర్లు ఏర్పడ్డాయి. చదువుకున్న వాడిమీద చదువుకోని వాడికి నమ్మకం మటుమాయమై పోయిందనిపించినపుడు - మానవత్వానికి, డబ్బుకు సంబంధం ఉండి తీరాలనే నియమమూ లేదని చిగురింపచేసే బాధ్యత మళ్లీ వ్యక్తి తనమీదే వేసుకోవలసి ఉంది... ''

నేను అతని వంకే చూస్తున్నాను. ఆయనా కళ్లు తిప్పుకోలేదు.

''చిన్న అవసరం ఆదుకుంటావా ?'' అని అడిగాడు.

నేను ఆయన వంక వింతగా చూశాను.

'' మనిషిని పరీక్ష చేయాలనే అనుకుంటాంగానీ పరీక్షించే శక్తి మనకుందని విర్రవీగుతాం గానీ అర్థం చేసుకోవడానికి ఎంత ఓర్పు, ఎంత శక్తీ ఉండాలి'' రాత్రి ఇంటికి వచ్చే సరికి పొద్దు పోతుందని మీ శ్రీమతికి కబురు చేయండి. ఏమైనా ఇబ్బందా ?''

లేదన్నట్లు ముఖంతోనే సైగను ప్రదర్శించాను.

కోటు విప్పి ఆఫీసు కుర్చీలో వేశాడు. లోపల చొక్కా భుజం చిరిగి ఉంది. నేనది గమనించడం ఆయన పట్టించుకున్నట్లు లేదు.

''కాఫీ తీసుకుంటారా ?'' కారులో ఇగ్నిషిన్ కీ తిప్పుతూ అడిగాడు.

''అబ్బే అక్కరలేదండీ'' అన్నాను.

దసపల్లా కాంప్లెక్స్‌లో కారు పార్క్ చేసి లోపలికి వెళ్లగానే '' ఏం తీసుకుంటారు ?'' అనడిగాడు.

''కొంచెం తొందర పని ఉంది.... వేగంగా తీసుకురాగలిగితే సంతోషం.....'' బేరర్‌తో ఆయన మాటలు తీరులోనే ఏదో ఆకర్షణ ఉంది.

''రైట్ సార్ !'' అంటూ ఆర్డరు తీసుకుని వెళ్లాడు బేరర్.

''చీకటి పడకుండా అక్కడికి చేరుకోవాలి.'

నేనేం మాటాడలేదు.

ఆయన నిదానంగా కారు పోనిస్తున్నాడు.

'' ఇరవై అయిదేళ్ల క్రిందట మహారాజా వారి కాలేజిలో బి. ఏ. చదువుకున్నాను. ఆ రోజులే వేరు.... మనం విజయనగరం వెళుతున్నాం. హాస్టల్లో ఉండే వాళ్లం... లంకవీధి, లక్కపందిర వీధి... అయోధ్యా మైదానం... ఏమిటో అంతా రామాయణంలోని పేర్లు. వింతగా తోచేవి. హాస్టల్లో సింహాచలం అని బంట్రోతు ఉండేవాడు. తాగుబోతు. అయినా సమర్థవంతంగా మమ్మల్ని చూసుకునేవాడు. అతనికి ఒక కొడుకు. అచ్చయ్య – మన ఈడు వాడే మరొక బంట్రోతు. కాని మాకు వాడి దగ్గర ఎంతో చనువు. మమ్మల్నందరినీ మేం చేసే ఆకతాయి పనుల్ని సైతం సమర్థిస్తూ అవసరాల్లో ఆదుకునేవాడు.

ఒక విచిత్రమైన సన్నివేశం.....

ఎదురుగా మలుపు తిరుగుతున్న లారీ మీద కొచ్చేస్తుంటే లాఘవంగా తప్పించడంలో ఆయన నా మీదకి ఒరిగాడు. నాకు ఒళ్లు ఝల్లుమంది. తల వెంట్రుక వాసిలో ప్రమాదం తప్పింది....

అచ్చయ్య.... ?

''వాడు మా వయసు వాడే అని చెప్పానుగా. ఓ రోజు అర్థరాత్రి హాస్టల్‌లోంచి అమ్మాయి బయటికి వస్తుండగా నలుగురి కంటాపడిపోయింది.... రాఘవగాడు రసికుడు. వార్డెన్ వరకూ వెళ్లిపోయింది విషయం... ఆయన చండశాసనుడు.... టెలిగ్రాం ఇచ్చాడు రాఘవ తండ్రికి.

మరుసటిరోజు కొత్త బ్లాక్‌కి దూరంగా ఉన్న గెస్ట్ రూంలో అంతరంగిక సమావేశంలో రాఘవ తండ్రి సమక్షంలో రాఘవని సంజాయిషీ అడిగారు.

రాఘవ నీళ్ళు నములుతాడనుకున్నాం... కాని చర్రున లేచాడు. మీరు నన్ను అపార్థం చేసుకున్నారు... నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చి నా పరువు తీశారు... ఇది మా వంశ ప్రతిష్ఠకే భంగం.... చెయ్యని తప్పుకి నన్ను ఈ విధంగా....''

రాఘవ ముఖ్య స్నేహితుడనైన నేనూ ఖంగు తిన్నాను.

'' ఏం ఓయ్ భాస్కర్... నిన్న రాత్రి... నువ్... ఎక్కడికెళ్లావ్...''

''మీ దగ్గర దాచడమెందుకు సార్... గేటుదూకి రెండో ఆట సినిమాకెళ్లాను... రూమ్‌లో రాఘవ ఒక్కడే ఉన్నాడు. నే వచ్చేసరికి రెండయి ఉంటుంది. తలుపు తీసే ఉంది. నిద్రపోతున్నాడు'' అనేశాను.

''నువ్ నిర్దోషివని నాకు నమ్మకం కుదరడంలే... నమ్మించగలిగితే సరే....''

''నమ్మనని మీరు భీష్మించుకోపోతే నిజం తెలిసివాడొకడున్నాడు. వాడిని అడగడం న్యాయమని నేననుకుంటున్నాను.''

''నమ్మనని నువ్ అనుకోనక్కరలేదులే... ఎవరా నిజం తెలిసిన మనిషి... హాస్టల్ కుర్రాడేనా ?''

''అచ్చయ్య...''

నిమిషాల మీద అచ్చయ్యకు కబురు వెళ్లి, అతను హాజరయ్యాడు.

'' ఎవర్రా ఆ అమ్మాయి ?''

''టెంపుల్. స్ట్రీట్ సరుకు బాబు !....''

''అంటే ?'' రాఘవ తండ్రి అడిగాడు.

''పాత రోజుల్లో బనారస్‌లో దాల్‌మండీ.... కన్యాశుల్కం నాటి విజయనగరంలో... స్ట్రీట్,

వేశ్యావాటికలు – మీరు వినలేదా ?''

వార్డెన్ ముఖంలోంచి తీవ్రత సడలింది.

'' ఇంతకీ హాస్టల్‌కే వచ్చిందా ?''

''లేదు బాబూ, మీరేమీ అనుకోకూడదు. నేనే ఆమెను మాటల్లో దింపాను. గేటు బయటే అనుకోండి... ఆ వివరాలెందుకు కాని రాఘవబాబుని మీరు తప్పుగా అంచనా వేశారు.... ఆ గుడివీధి మనిషెక్కడ... మన కుర్రకారులెక్కడ... ఇది అన్యాయం !''

వాడే తీర్పు ఇచ్చేశాడు.

అయితే... రాఘవ చేత గది ఖాళీ చేయించి తీసుకు వెళ్లిపోయారు వాళ్ల నాన్నగారు.

అదీ అచ్చయ్య కథ.

వాడంటే నాకెందుకో గురి... పాపం, పుణ్యం లాంటి ఆలోచనలు ఆ వయసులో అంత లోతుగా రావు కాని మనిషిగా... మీరు చెబితే నమ్మరు. నెలాఖరు రోజుల్లో మనియార్డరు రాగానే ఇస్తామని చాలా మంది కుర్రాళ్లం వాడి దగ్గర పదో, ఇరవయ్యో పుచ్చుకున్న వాళ్లమే.

వాడు అంటూ ఉండేవాడు. ''మీరు చదువుకుంటున్నవాళ్లు. పెద్ద పెద్ద ఆఫీసర్లయిపోతారు... అచ్చయ్యగాడెలా ఉన్నాడో ఎప్పుడైనా తలచుకుంటారా ? చూద్దాంలెండి నేనిక్కడే ఉంటా....''

''బీద వాళ్లలో ఉన్న మనసు కలిగిన వాళ్లలో ఉండదు... ఏం చదువులో... ఏం డబ్బో... మనిషికి మనసు ముఖ్యంగాని... వాడి మాటలు నేను ఎప్పుడూ మరవలేను.''

విశాఖపట్నం వచ్చిన దగ్గర నుంచీ వాడిని విజయనగరం వెల్లి చూడాలనే అనుకుంటున్నా... అయోధ్య వెనకాలే... ఒక గుడిసెలో వాడి కొంప...

'' ఈరోజు మధ్యాహ్నం ఒకాయన పైపు తాగుతూ వచ్చి నా గదిలో చాలా సేపే ఉన్నాడు చూశారా?''

''చూశాను సార్... మనిషి మన చిన్నతనంలో సినిమాలో చూసిన దేవానంద్‌లా మహా ఇంప్రెస్‌వ్‌గా ఉన్నడు... ఎవర్సార్ ఆయన ?''

''మా రాఘవ గాడులే...''

''వాట్ !''

'' ఔను. వాడే చెప్పాడు. అచ్చయ్యకి టి.బీ. వచ్చి మంచమెక్కాడని.''

నాకు బోధపడింది.. వాడిని చూడడానికి ఈయన ఈరోజు హఠాత్తుగా బయలుదేరాడు.

హైవే మీద నుంచి చింతల వలస మలుపు తిరిగి మెటల్ రోడ్డు మీద పోతోంది కారు.

'' ఇదేమిటి సార్... హైవే వదిలేసి...''

''హైవే వదలేయాల్సిన అవసరాలూ వస్తుంటాయి.''

ఏదో నర్మ గర్భితంగా మాట్లాడేడనిపించింది.

'' ఇది ధర్మపురి గ్రామం. మేం చదువుకున్న రోజుల్లో ఇది ఓ కుగ్రామం. ఇక్కడ ఇప్పుడో జూనియర్ కాలేజి వచ్చింది... ఇ లైక్ దిస్ ప్లేస్.... ఇక్కడ మంచి మామిడితోట ఉండేది... రాధికా, నేనూ...''

''రాధిక –''

''నా భార్య...''

నేనేం అడగలేదు.

కొంచెం దూరం వచ్చాక అతను కారు ఆపేశాడు.

చుట్టూ చూశాను....

ఎడమచేతి పక్క ఒక చెరువులో గేదెలు కడుగుతున్నారు. ఆయన కారు రోడ్డు పక్కకి తీసి ఆపి తలుపు తీసి దిగాడు.

నేనూ దిగాను.

'' ఇది చానమ్మ చెఱువు... ఓ జమీందారు ఓ చానతో ఈ కొలను వెనక కొబ్బరితోటలో... ఆ నోటా ఈనోటా కొలను పేరు సానిదాని చెరువైందని మేం చదివే రోజుల్లో చెప్పుకునేవారు... అది కాలక్రమేణా సానిదాని చెరువు నాజూకు భాషలో చానమ్మ చెరువూ అయింది !''

ఆయన కళ్లు దూరంగా ఉన్న కొబ్బరిచెట్లూ, మామిడితోపూ, పచ్చటి పంట పొలాల్లో తిరుగుతూ ఉండే ఆయన పాతికేళ్లు వయస్సు తగ్గిన వాడిలాగా కనిపించాడు.

''చీకటి పడుతున్నట్లుంది...'' నేనే ఆయన్ని ప్రస్తుతంలోకి తీసుకుని వచ్చాను.

'' ఆఁ!... అవును కదూ... పదండి''

''అది ... అయోధ్యామైదానం. అల్లదిగో మా హాస్టల్... మా గది మరోసారి వచ్చినప్పుడు చూద్దాం... ఒక్కక్షణం...'' కారు దిగి బొనెట్ తెరచి ఉంచి...'' మీరు ఓ అరగంట ఇక్కడే ఉండండి...''

చొక్కా భుజం తడుముకుని ఆయన మసక చీకటిలోకి నడిచాడు.

పావు గంట... సిగరెట్టు తీసి వెలిగించాను... అరగంట... మరొకటి... మూడు పావు గంటలయిపోయింది. చీకటి పడిపోయింది.

''సార్ ! సార్ ! క్షమించండి సార్. వీడు మా స్నేహితుడు... మీరు కాదనకపోతే మనతో వైజాగ్ వస్తాడు.. మన ఆఫీసులో ఈ రాత్రి పడుకుంటాడు... జబ్బు మనిషి బాబూ... కాదనకండి... ఎటూ మనకి దోవే కదా... ప్లీజ్ దయచేసి కాదనకండి.''

మా ఆఫీసరు నాతో అలా మాట్లాడుతుంటే నాకు మతిపోయింది.

''రారా ! మా దొరగారు మా మంచి మనిషి...'' అతను వచ్చి ముందు సీట్లో కూచున్నాడు... డిక్కీలోకి ఓ మూట చేరింది.

''బాబూ... నా మీద కోపమా ? వీడి పేరు అచ్చయ్య... వీడు లేకపోతే నా బ్రతుకు చదువుకునే రోజుల్లో వీధిన పడేది... చానమ్మ చెరువు దగ్గర కొబ్బరి తోటల్లో... మామిడి తోపులో... రాధిక రహస్యం కాసింది వీడే సార్... రాఘవ లాంటి స్నేహితుడూ, అచ్చయ్య లాంటి మనసున్న మనిషీ అరుదు సార్..''

'' ఏరా అచ్చయ్యా... చదువుకున్నోళ్లకి మనసుండదనే వాడివి... మా ఆఫీసరుగారు ఎల్లాంటి వార్రా ?''

'' ఏదో నాదీ కుర్రతనమే మరి, ఆ రోజుల్లో !''

'' ఇంతకీ ఆ టెంపుల్ స్ట్రీట్ గర్ల్ ఎవరో నిజంగా తెలీదా ?'' నేను అడిగాను.

''తెలియక పోవడమేమిటి బాపూ... ఎటొచ్చీ వీధి పేరే కల్పన.. ఆయమ్మ రాధిక... పెద్దింటి

పిల్లే. సొందాని చెరువు నాకో అవిడియా ఇచ్చింది. మన భాస్కర్‌బాబూ, ఆ అమ్మాయీ తోటలంటా, తోపులంటా తిరుగుతూ ఉండేవారు... ఆ రోజు రాఘవబాబు నన్ను చెప్పమన్నట్టు నే చెప్పకపోతే బాబుని కాలేజి నుంచి తగిలేసేవారు...''

వాడిని ఆఫీస్ దగ్గర దింపి నైట్ వాచర్‌తో చెప్పాను. జాగ్రత్తగా చూసుకోమని.

''రేపు వీడిని ఆస్పత్రిలో చేర్పించాలి. రాధికకు ఒక సర్‌ప్రైజ్. కానీ జబ్బు పడ్డాడంటే బాధపడుతుంది పాపం... షాక్ చెయ్యడం ఇష్టంలేక ఆఫీసులో దింపా...''

ఆయన నన్ను ఇంటి దగ్గర దింపిన తరువాత ఆయనా దిగాడు... మర్యాదకోసం కాదు.. ఆప్యాయత చూపడం కోసం.

తలుపుతీస్తూ ఉండే కారులో లైటు వెలిగింది. మధ్యాహ్నం చూసిన పైపు పెద్ద మనిషికి అన్నలా అనిపించాడు మా ఆఫీసర్... మనసున్న మనిషి.

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**

18-1-89